## నవంబర్ 6 న నందికొట్కూరు పట్టణములో
## "శ్రీ కాశీ ప్రసాద ఆశ్రిత ఆశ్రయ గృహప్రవేశ" దృశ్యములు







# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 41 సంచిక 5

పేజీలు 44

జనవరి 2022

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 8

అగస్త్య హృదయం ...................... ..............10

వేదాంత బోధ ..................................................12

అక్రూర స్తుతి ....................................................14

గురుభక్తి ...............................................................16

నేను ......................................................................19

స్వభావం ..............................................................21

దేహాత్మ భావన.....................................................25

కైవల్యోపనిషత్ ... ..........................................27

కాల మహిమ ............................. ..............29

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .......................32

భారతీకృష్ణ తీర్థ స్వామి ...........................33

నిరీక్షణ ............................. ..............................35

కరదీపిక ..........................................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ...................41


**పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2022**

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**18)** **అజునకు తండ్రివయ్యు సనకాదులకున్ బరతత్త్వ మయ్యుస**
**ద్విజమునికోటికెల్లబర దేవతయ్యు దినేశవంశ భూ**
**భుజులకు మేటివయ్యు బరి పూర్ణుడవై వెలుగొందుపక్షిరా**
**డ్ధ్వజమిము బ్రస్తుతించెదను దాశరథీ కరుణాపయోనిధీ!**




భావం - బ్రహ్మకు దండ్రివి, సనకాదులకు పరతత్త్వానివి, బ్రాహ్మణులకు, ఋషులకు ముఖ్య దేవుడవు, సూర్యవంశపు రాజులలో అధికుడవు, పరిపూర్ణుడవై వెలుగొందు గరుడధ్వజుడవు అట్టి నిన్ను పొగిడెదను దాశరథీ కరుణాపయోనిధీ!



# ఆహ్వానము



## **శ్రీ సద్గురు స్వామి స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవములు**

ఆధ్యాత్మిక జిజ్ఞాసువులారా!

శ్రీకాళీ వనాశ్రమము (శ్రీకాళీగార్డెన్స్) పరీధావి నామ సంవత్సర నిజ వైశాఖ బహుళ తదియ బుధవారము అనగా 31-5-1972న శ్రీబాబు విజ్ఞానమందిర్ గృహప్రవేశముతో ప్రారంభింపబడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భముగా శ్రీ శుభకృత్ నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి బుధవారం (శంకర జయంతి) 6-5-2022 నుండి బహుళ తదియ బుధవారం 18-5-2022 వరకు శ్రీ సద్గురుదేవుల పరమానుగ్రహంతో స్వర్ణోత్సవములు నిర్వహించు కుంటున్నాము. అందులో భాగంగా **శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహామృత్యుంజయ సంపుటిత రుద్రయాగము**, అఖండ హరినామ సంకీర్తనము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహింపబడును. అందరూ ఆహ్వానితులే!

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

8-12-1980

ఈరోజు సాయంత్రం ప్రార్థన అయిన తర్వాత శ్రీ బాబూజీ దర్శనం యిచ్చారు. ఆంధ్రప్రభ ఎడిటర్ కూచిమంచి సుబ్రహ్మణ్యంగారు, ఆయన భార్య వచ్చారు. కొద్దిరోజుల క్రితం ఎడిటర్ గారింట్లో ఒక బంగారు వస్తువు పోయింది. ఎంత వెదికినా దొరకలేదు. ఆ విషయాన్ని శ్రీ బాబూజీకి నివేదించుకున్నారు.



శ్రీ బాబూజీ ఎడిటర్‌గార్ని గోధుమలు, ఆవాలు, బియ్యంతో రామలింగేశ్వరునికి అభిషేకం చేసుకోమన్నారు.

వారు ఈరోజు ఆశ్రమానికి వచ్చేముందు, 'పోయిన బంగారు వస్తువు వారికి దొరికింది. అది పరుపు క్రిందనే వుంది. అంతకు పూర్వం అక్కడ ఎన్నోసార్లు వెదికారు. అప్పుడు దొరకలేదు. కాని ఇప్పుడు దొరికింది' అని ఆ విషయాన్ని శ్రీ బాబూజీకి ఎడిటర్‌గారు చెప్పారు.

'ఆ వస్తువు ఎక్కడనుంచి వచ్చిందండి ఎడిటర్ గారు? అన్నారు శ్రీ బాబూజీ. 'నిజంగా ఎక్కడినుంచో వచ్చిందండి. అక్కడ మాత్రం లేదు. అక్కడ ఉంటే అంతకు పూర్వం మాకెందుకు కనబడలేదు?' అన్నారు ఎడిటర్‌గారు. 'వస్తువు దొరికింది కదా! అభిషేకం చేసుకోవాలాండి?' అని ఎడిటర్‌గారు ప్రశ్నించారు.

"తప్పకుండా చేసుకోవాలి అభిషేకం చేసుకొంటాననంటేనే కదా ఆవస్తువు దొరికింది" అన్నారు శ్రీబాబు. శ్రీబాబూజీ ఇంకా మాట్లాడుతూ "రాజమండ్రిలో నా బాల్యంలో ఒక ఆంజనేయస్వామి భక్తుడుండేవాడు. అతడు వ్యాపారస్తుడు. తనకు వ్యాపారంలో లాభంవస్తే కొంత స్వామికి ఇస్తానని మొక్కుకున్నాడు. అలాగే లక్షలు గడించాడు. స్వామికి ఇస్తానన్న పైకం ఈ సంవత్సరం కాదు వచ్చే సంవత్సరం అని, వచ్చే సంవత్సరం కాదు ఆపై సంవత్సరం అని, చివరికి లక్షరూపాయల దాకా బాకీపడ్డాడు.

ఇంత సొమ్ము దాచుకోటానికి ఇనుపపెట్టె కావాలి కదా మరి! స్వామి దగ్గరలేదు కాబట్టి, ఆ సొమ్ము నా ఇనుపపెట్టెలోనే దాచి ఉంచుతానని లౌక్యంగా దాటేస్తాడు. చూశారా! ఎడిటర్‌గారూ! భగవంతుడిని మానవుడు ఎంత తేలికగా అంచనావేస్తాడో" అనేసరికి, ఎడిటర్‌గారు కల్పించుకుని "ఆ షావుకారు తర్వాత ఏం చేశాడు?" అని అడిగాడు.

శ్రీ బాబు మాట్లాడుతూ 'ఏం జరగాలో అది జరిగింది. వ్యాపారంలో విపరీతమైన నష్టం వచ్చింది. అప్పుడు నన్ను ఆశ్రయించాడు. అలాగే ఏదో నివారణోపాయం చెప్పాను. ఏం చేస్తాం చెప్పండి మా బిజినెస్ మాది' అన్నారు శ్రీ బాబూజీ.

ఇంతలో భక్తులంతా శ్రీ బాబూజీ దర్శనార్థం వచ్చారు. వడాలి పిన్నిగారు వచ్చారు. "పిన్నీ ఏమైనా విశేషాలుంటే చెప్పు" అన్నారు శ్రీ బాబు.

'నాకేం తెలుసు? మీరు ఏదైనా చెపితే విందామని వచ్చాను' అన్నారు పిన్నిగారు.

"ఎంతకాలమైనా ఇంతేనా? జుట్టు నెరసినా ఇంకా వినటమేనా? చక్కగా అడిగినపుడు చెప్పాలి. అందుచేతనే మీరందరూ అంటే నాకు చిరాకు" అన్నారు శ్రీ బాబు.

కొంతసేపు అంతా మౌనంగా ఉన్నారు. బాబు మాట్లాడుతూ "మనస్సు పరమాత్మయందు లగ్నమై ఉంటే చాలు. అదే గీత బోధిస్తుంది. గీతలో భక్తియోగమైనా, జ్ఞానయోగమైనా, మోక్షసన్యాసయోగమైనా సరే అదే బోధిస్తుంది. కర్మయోగమైనా అంతే, ఏ పని చేస్తున్నా నీ మనస్సు పరమాత్మయందు నిలిపినాసరే, పరమాత్మని నీ మనస్సు యందు నిలుపుకున్నాసరే ఇంక కావలసింది ఏముంది? గుణత్రయాలు, సంకటములు, సంకల్పములు, వికల్పములు అన్నీ హరింపబడతాయి అని ప్రబోధిస్తుంది భగవద్గీత.

మనస్సు, బాహ్యేంద్రియాలకు, అంతరింద్రియాలకు మెయిన్ స్విచ్ వంటిది. ఏ ఇంద్రియానికి ఆ ఇంద్రియం పనిచేసినా మనస్సు పరమాత్మపై లగ్నం చేసినప్పుడు మాత్రం మిగిలిన ఇంద్రియాలు అన్నీ మనస్సులోనే లయించిపోతాయి. మన ఇంట్లో Lights, fans ఉంటాయి. ప్రతిదానికి వేరువేరు Switches ఉంటాయి. కాని అన్నింటికి కలిపి ఒక Main Switch ఉంటుంది. దీనిని ఆపితే అన్నీ ఆగిపోతాయి.

కాబట్టి మనస్సు నిల్చిపోతే గాలిలేని దీపమువలె నిశ్చలత్వాన్ని

పొందుతుంది. జ్ఞానియొక్క మనస్సు అటువంటిది. జ్ఞాని ఆత్మ స్వరూపుడు, పరమహంస స్వరూపుడు, ఆత్మశక్తి సర్వత్రా వ్యాప్తమై వుంటుంది. ఆ శక్తి కేశములో, గోరులో ఇది అది అననేలా, శరీరమంతా వ్యాప్తమై ఉంటుంది. రక్తములో ప్రవేశపెట్టిన మందు శరీరమంతా వ్యాప్తమవుతుందా లేదా! అదే విధముగా ఆత్మశక్తి వ్యాప్తమై ఉంటుంది. అందుచేతనే మహాత్ముల పవిత్ర అవశేషాలు భద్రంగా దాచి ఉంచుతారు. అవి చాలా శక్తివంతమైనవి.

అందుచేతనే శంకరుని వద్ద వరములు పొందిన ఒక రాక్షసుని సంహరించటానికి ఇంద్రుడు ఒక జ్ఞాని యొక్క వెన్నెముకను వజ్రాయుధంగా చేసుకొని సంహరిస్తాడు" అన్నారు శ్రీబాబు.

అంతలో వెంకటరత్నంగారు, పండితులు శ్రీ శాస్త్రిగారితో వచ్చారు.

శ్రీ బాబు మాట్లాడుతూ, "ఆయనను ఎందుకు అలా బాధపెడ్తావయ్యా? నేను ఇలా కూర్చొని వారు అలా నుంచుని మాట్లాడితే బాగుంటుందా?" అన్నారు శ్రీ బాబు.

శాస్త్రిగారు 'లేదు బాబూ! నేనే వచ్చాను' అన్నారు.

శాస్త్రిగారితో "అమ్మ దేవాలయం, నవగ్రహాల గురించి చర్చించారు. తర్వాత శాస్త్రిగారితో మహానంది వెళదాం. మహానంది వద్దనున్న విష్ణునంది వద్ద, సర్వకాలములందు ఓంకారనాదం వినబడుతుంది. అది గొప్ప విశేషం. అలాగే శ్రీశైలంలో ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కొక్క అనుభూతి కలుగుతుంది. అహోబిలం కూడా దర్శించవలసిందే. అక్కడ రామానుజులవారి పీఠము ఉంది. అక్కడ ఉన్నది ఎవరు? నరసింహస్వామి.

శాస్త్రిగారింట్లో ఒక విశేషముందండి. అది నాకు, ఆయనకే తెలుసు. ఇంక ఎవరికీ తెలియదు? ఆయన ఇంట్లో "బిందెలోని మంచినీరు 12 గంటలవేళ ఉప్పునీరుగా మారుతుంది. తిరిగి 3గంటలకు మంచినీరుగా మారుతుంది" అన్నారు శ్రీ బాబు.

కావాలంటే ఆయనను అడగండి. అది గౌతమిలోని నీరు అయితేనే అలా మారుతుంది. ఆ నీరు ఎవరు తెచ్చినాసరే, అది స్థల ప్రభావం" అన్నారు శ్రీ బాబూజీ.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

*భగవంతుడు ఎక్కడ వున్నాడు?*

**గురు కృపాంజన్ పాయో మోరే భాయో!**
**రామ్ బినా కుఛ్ జానత్ నాహీ ॥**

1. **అంతర్ రామా - బాహర్ రామా**
**జహా దేఖే తహ రామ్ హి రామా ॥**

2. **జాగత్ రామా - సోవత్ రామా**
**సపన్ మే దేఖా తహా రామ్ హి రామా ॥**



అనే కబీర్‌దాస్ కీర్తనను పాడి శ్రీమాతాజీ వారు ఈ విధంగా బోధ చేశారు....

మనమందరం భగవంతుడెక్కడ? ఎక్కడ? అని వెదుకుతున్నాం. భగవంతుడు ఎక్కడ లేడు? ఈ విధంగా ప్రశ్నించుకుంటే భగవంతుడు లేని అణువు కూడా ఈ సృష్టిలో లేదు. అందుకనే ఆయనను సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వశక్తి సంపన్నుడు, సర్వవ్యాపి అని వర్ణిస్తాం. కనుక ఆయనలేని చోటు ఎక్కడ వుంటుంది? మరి సర్వేసర్వత్రా వున్న ఆ ఈశ్వరుడు నీలో లేడా? మరి నీలోనూ, సర్వత్రా వున్న ఆ పరమాత్మను నువ్వు ఎందుకు గుర్తించడం లేదు? ఏది అడ్డు వస్తోంది నీకు అని ఎప్పుడైనా విచారణ చేశావా?

విషయాదులతో నిండిపోయిన నీ మనస్సే నీకు అడ్డుగా వస్తోంది. 'నేను' అంటే 'ఈ దేహమే నేను' అనే దేహాత్మ భావనే నీకు అడ్డుగా నిలుస్తోంది. ఇది పోయేది ఎలా? అది కేవలం సద్గురుదేవులను ఆశ్రయించి, వారి బోధలను శ్రద్ధగా శ్రవణ మననాదులను చేసి, నిదిధ్యాసకు తెచ్చుకోవాలి. సద్గురుదేవుల కృపకు పాత్రులమవ్వాలి.

శ్రీ కబీర్‌దాస్‌వారు **'గురు కృపాంజన్ పాయో మోరే భాయో'** అన్నారు. అంటే గురుకృప అనే అంజనాన్ని సంపాదించి, దానిని నీ మనస్సుకు పూసుకోవాలి. కేవలం కళ్ళకే కాదు. **అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా। చక్షురున్మీలితం యేన తస్మైశ్రీ గురవే నమః** - గురుదేవులు అజ్ఞానమనే చీకటికమ్మి అంధులమైపోయిన మనకు జ్ఞానమనే అంజనాన్ని మన

కళ్ళకు ప్రసాదించి, ఒక చిన్న శలాకతో శస్త్రం చేసి మన కంటికి కప్పి వున్న అజ్ఞానమనే పొరలను ఛేదిస్తారు. తద్వారా మన యొక్క అజ్ఞానమనే దృష్టిపోయి, జ్ఞానదృష్టి కలుగుతుంది. అప్పుడు మనకు ఈ సృష్టి అంతా కూడా ఏకత్వంగానే గోచరిస్తుంది. ఈ సృష్టి అంతా ఈశ్వరుని యొక్క సృష్టి. అసలు అదంతా ఈశ్వర స్వరూపమే. దానిని మనం ప్రపంచ భావనతో చూస్తున్నాం కాబట్టి మనకి వైవిధ్యంగా కనిపిస్తోంది. కానీ, ఎప్పుడైతే మనం నిరంతర వివేకవంతమైన విచారణ వలన మన దృష్టిని మార్చుకుంటామో, అప్పుడు ఈ సృష్టి అంతా కూడా భగవత్స్వరూపంగానే కానవస్తుంది.

అదే ఇక్కడ కబీర్‌దాస్ చెబుతున్నారు. లోపల, బయటా ఎక్కడ చూస్తే అక్కడ భగవంతుడే వున్నాడు. మెలకువగా వున్నప్పుడు రాముడే, స్వప్నంలోనూ రాముడే, గాఢ సుషుప్తిలోనూ రాముడే వున్నాడు అని ఆయన దర్శిస్తూ చెబుతున్నారు.

'రమ' ఇతి రామః అందరినీ రమింపజేసేవాడు రాముడు. రాముడి దయ లేకుండా ఈ జగత్తులో ఏమీ లేనే లేదు. అది గుర్తింప జేసేవాడే గురుదేవుడు.

నిరంతరం విషయాదులనే కొమ్మలమీద గంతులువేసే ఈ మనస్సనే కోతిని నీవు తీసుకో ప్రభూ! అని శ్రీ శంకరభగవత్పాదాచార్యులు పరమేశ్వరుడిని ప్రార్థించారు. దాని వలన నీకు భిక్షావృత్తి బాగా సాగుతుంది; నాకా మనశ్శాంతి లభిస్తుంది అన్నారాయన.

నిరంతరం బాహ్య విషయాదులపైనే మనస్సు దృష్టి వుంచితే, ధ్యానానికి కూర్చునేసరికి అవే మనస్సులో మెదలుతూ వుంటాయి. జాగ్రదావస్థ అంతా మనం భగవంతునితోనే గడిపితే నిద్రలో మనకి ఇంక ఇతర ఆలోచనలేముంటాయి? ఒకవేళ స్వప్నం వచ్చినా కూడా అక్కడ కూడా భగవద్దర్శనమే అవుతుంది. అప్పుడు సర్వే సర్వత్రా, లోపల, బయటా, మధ్యలో అంతా కూడా ఆ భగవంతుడినే దర్శించ గలుగుతాం. అటువంటి దివ్యానుభూతిని పొందగలిగే అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాన్ని, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# అగస్త్య హృదయం

గత సంచిక తరువాయి - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**వ్యోమనాధ స్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః**

**ఘనవృష్టిరపాం మిత్రో వింధ్యవీధీ ప్లవంగమః ॥**

ఆకాశమునకు అధిపతియై, చీకట్లను పారద్రోలేవాడు, ఋగ్యజుస్సామవేదములను క్షుణ్ణంగా ఎరిగినవాడు, ఘనమైన వర్షములను కురిపిస్తూ జలములకు మిత్రుడయినవాడు, వింధ్య వీధులలో వేగముగా సంచరించేవాడు సూర్యభగవానుడు.

పైకి ఆదిత్యుని యొక్క గుణవిశేషముల వర్ణన లాగా కనిపించే ఈ శ్లోకముతో అగస్త్యులు గుహ్యముగా గురు తత్వమును, సాధనకు తోడ్పడే విశేషములనూ అందిస్తున్నారు.

**'వ్యోమనాధుడు'** అన్న సంబోధనతో అనంతాకాశమునకు ఆధారమైన గురుస్వరూపముగా ఆదిత్యుని దర్శింపజేస్తున్నారు. **వ్యోమవత్ వ్యాప్తదేహాయ** అని దక్షిణామూర్తి స్తోత్రములో వివరింపబడిన అనంతమైన గురుతత్వము ఇందులో గోచరిస్తుంది. ఆకాశమునకు కాంతిని ప్రసాదిస్తూ ఆధారమైన ఆదిత్యుని వలెనే చరాచర జగత్తుకు గురుశక్తియే కేంద్రమయి వున్నదన్న సత్యము దీనిలో దాగి వున్నది. సప్త వర్ణములను ప్రతిఫలిస్తున్నప్పటికీ ఆకాశము ఏరంగూ అంటకుండా వివర్ణమై వుంటుంది. అదే విధంగా **'ఖం'** అన్న శబ్దాన్ని సూచించే ఆకాశతత్వమును గ్రహించి, సాధకుడు సుఖ దుఃఖములైన ద్వంద్వములకు అతీతుడై వుంటారన్న సందేశమును అగస్త్యులు ఇస్తున్నారు.

**తమోభేదీ** అన్న శబ్దము చీకటిని తొలగించే సూర్యుడినే కాక, అజ్ఞానమనే తమస్సును నిర్మూలించే గురు ప్రకాశమును తెలియజేస్తోంది. ఈ విధంగా **వ్యోమనాధ స్తమోభేదీ** అంటూ అఖండమండలాకారమూ, చరాచరవ్యాప్తమై అజ్ఞానమును తొలగించే గురుపరమాత్మను అగస్త్యులు ఆవిష్కరిస్తున్నారు.

**ఋగ్యజుస్సామపారగః** అన్నది ఆదిత్యుడిని వేదపారంగతుడైన గురుస్వరూపముగా ప్రకటిస్తోంది. ఆ రూపముతోనే సూర్యభగవానుడు బాల హనుమంతునికి ఉపదేశము చేయడమూ, తద్వారా హనుమ వేదవిదుడవ్వడమూ మనకు శ్రీమద్రామాయణము ద్వారా తెలిసిన

విషయమే. భగవద్గీతలో గీతాచార్యుడు **వేదాంత కృత్ వేదవిత్ ఏవ చాహం** అంటూ వేదముల కర్తనూ, వేదముల ద్వారా తెలియబడుతున్న పరబ్రహ్మా కూడా తానేనని వెల్లడించారు. మనం గురుదేవులను ప్రియముగా అర్చించే **ఓం వేదపారగాయ నమః; ఓం వేదవేదాంగ కోవిదాయ నమః** అనే నామముల అంతరార్థము కూడా అదే కదా!

**ఘన వృష్టిః** అన్న శబ్దము గురుదేవుల అపారమైన కరుణావృష్టిని తెలియజేస్తున్నది. ఆ వృష్టిలో మనం నిరంతరమూ తడుస్తున్నవారమే. అవ్యాజమైన ఆ కరుణామృత వర్షము కేవలం అనుభవైకవేద్యమే. ఆ ఘనవృష్టికి కారకుడైన ఆదిత్యుడిని **అపాం మిత్రః** జలములకు మిత్రుడు అనడంలో సందేహం లేదు. మరికొంత పరిశీలిస్తే సముద్రంలో వున్న ఉప్పునీటిని ఆవిరిగా మార్చి తిరిగి తియ్యని నీటిగా ఆదిత్యుడు వర్షించినట్లు మనలోని గుణదోషములను నిర్మూలిస్తూ, మన లోపల దాగివున్న సత్యవస్తువును గుర్తింపజేసే గురుదేవులను మించిన మిత్రులు ఎవరుంటారు?

**వింధ్యవీథీ ప్లవంగమః** అన్న సంబోధన వింధ్య వీథిలో వేగంగా ప్రయాణించే సూర్యునితోపాటు సాధనామార్గంలో మనలను ముందుకు నడిపిస్తున్న గురుదేవులను సూచిస్తోంది. గురుకృపతో సాధకుడు భవసాగరమును ఒక్కసారిగా లంఘించి దాటగలడని **ప్లవంగము** అన్న శబ్దము తెలియజేస్తోంది.

'నేను శ్రీరామునిచే విడువబడిన బాణమును' అంటూ నిశ్చల భక్తితో తన ప్రభువును నమ్మిన హనుమ అవలీలగా సముద్రాన్ని లంఘించి తన లక్ష్యసిద్ధియైన సీతమ్మవారి దర్శనమును పొందటం మనందరికీ విదితమే. అదే విధంగా సాధకుడు తన సాధనలో వచ్చే అడ్డంకులను గురుకృప ద్వారా ఎదుర్కొని ముక్తిని చేరుకోగలడని **ముక్తిమూలం గురోకృపా** అని అగస్త్యులు ఈ శ్లోకం ద్వారా తెలియ జేస్తున్నారు.

- సశేషం

# వేదాంత బోధ

సేకరణ - రాఘవ రాజు

భగవద్గీత, వేదాంతం మనకు బోధించేది ఏమిటి? త్వమేవాహం. కన్నతల్లి కడుపులో నుండి బయటపడి, తొలిసారి ఊపిరి పీల్చిన క్షణం నుండి పుడమి కడుపులోకి చేరుకునే ఆఖరిసారి ఊపిరిని విడిచిపెట్టడం దాకా సాగే ప్రస్థానం పేరే నేను. నేనే ఈ నేను. ప్రాణశక్తి అయిన 'ఊపిరి'కి మారుపేరు. ఊపిరి వున్నంత దాకా నేను అనే భావన కొనసాగుతూనే వుంటుంది. జనన మరణాల మధ్యకాలంలో సాగే జీవన స్రవంతిలో ఈ నేను ఎన్నెన్నో పోకడలు పోతుంది. మరెన్నో విన్యాసాలు చేస్తుంది. అజ్ఞానంచేత ఈ నేనులో నుండే నాది అనే భావన పుడుతుంది.

ఈ నాది లో నుండి............... 1. నా వాళ్ళు, 2 నా భార్య, 3 నా పిల్లలు, 4 నా కుటుంబం, 5, నా ఆస్తి, 6. నా ప్రతిభ, 7 నా ప్రజ్ఞ 8 నా గొప్ప అనేవి పుట్టుకొచ్చి చివరకి ఈ నాది అనే భావన భూమండలాన్ని కూడా మించిపోయి, ఆకాశపు సరిహద్దును కూడా దాటిపోయి, నిలువెత్తు విశ్వరూపాన్ని దాల్చి, **అహం** గా ప్రజ్వరిల్లుతుంది.

'అహం' అనే మాయ పొర కమ్మేసిన స్థితిలో ఈ నేను **తానే సర్వాంతర్యామిని** అని విర్ర వీగుతుంది. నాకు ఎదురు లేదని ప్రగల్భాలు పలుకుతుంది. 1 పంతాలతో, 2 పట్టింపులతో, 3 పగలతో, 4 ప్రతీకారాలతో తన ప్రత్యర్థిని సర్వ నాశనం చేయడానికి సిద్ధ పడుతుంది.

1 బాల్య, 2 కౌమార 3 యౌవన 4 వార్ధక్య దశల దాకా లింగ తేజంతో విజేతగా నిలిచిన నేను అనే శరీరం ఏదో ఒకనాడు మృత్యు స్పర్శతో కుప్పకూలిపోతుంది. వంది మాగధులు ఎన్నో ప్రశంసలు చేసినా శరీరం కట్టెలాగ మిగులుతుంది. సుందరీమణులతో మదనోత్సవాలు జరుపుకున్న దేహం నిస్తేజంగా పడి వుంటుంది. సుఖ భోగాలతో అష్టైశ్వర్యాలతో తులతూగిన నేను చుట్టూ చేరిన బంధుమిత్ర సపరివారపు జాలి చూపులకు కేంద్రబిందువుగా మారుతుంది. కడసారి చూపుల కోసం కొన్ని గంటలపాటు ఆపి వుంచిన విగత జీవికి అంతిమ యాత్ర మొదలు అవుతుంది. మరుభూమిలో చితి మంటల మధ్య సర్వ బంధనాల నుంచీ విముక్తి కలుగుతుంది. మొలకు చుట్టిన

ఖరీదైన కౌపీనంతో సహా మొత్తం కాలి బూడిద అవుతుంది.

1 నేనే శాసన కర్తని, 2 నేనే ఈ భూమండలానికి అధిపతిని, 3 నేనే జగజ్జేతను అని మహోన్నతంగా భావించిన **నేను** లేకుండానే మళ్ళీ తెల్లవారుతుంది. రోజు మారుతుంది. **ఊపిరితో మొదలై ఊపిరితో ఆగిన** ఈ 'నేను' కథ అలా సమాప్తమవుతుంది.

అందుకే ఊపిరి ఆగక ముందే 'నేను' గురించి తెలుసుకో మంటుంది భగవద్గీత. చితిమంటలు చూస్తున్నప్పుడు కలిగేది శ్మశాన వైరాగ్యం మాత్రమే. అది శాశ్వతం కానే కాదు. నేను గురించిన సంపూర్ణమైన అవగాహనతో వున్నప్పుడే పరిపూర్ణమైన వైరాగ్య స్థితి సాధ్యమవుతుంది.

వైరాగ్యం అంటే అన్నీ వదిలేసుకోవడం కానే కాదు. దేని మీదా మోహాన్ని కలిగి వుండకపోవడం, తామరాకు మీద నీటి బొట్టులా జీవించగలగటం. స్వర్గ నరకాలు ఎక్కడో లేవు. మనలోనే వున్నాయి. మనిషికి, నిత్యసత్యమైన ఆత్మదృష్టిని పొందగలగటమే స్వర్గం. ఈ జీవన సత్యాన్ని తెలియజేసేదే వేదాంతం.

1 నిజాయితీగా, 2 నిస్వార్థంగా 3 సద్వర్తనతో 4 సచ్ఛీలతతో 5 భగవద్ధ్యానంతో జీవించమని తెలిపేదే వేదాంత సారం. **అహం బ్రహ్మాస్మి** అంటే 'అన్నీ నేనే' అనే స్థితి నుండి **త్వమేవాహమ్** అంటే 'నువ్వే నేను' అని భగవంతుడి పట్ల చిత్తాన్ని నిలుపుకోగల తాదాత్మ్య స్థితిని చేరుకోగలిగితేనే మానవజన్మకు సార్థకత.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులయిన కొండ ఏకాంబరేశ్వరి (సుగుణమ్మగారి చిన్నక్క) 13-12-2021 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 90 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## అక్రూర స్తుతి

- ఎన్. కుట్టీ

దేవకీ వసుదేవ పుత్రులు గోకులంలో నందుని ఇంట్లో పెరుగుతున్నారని నారదుని ద్వారా తెలుసుకున్న కంసుడు వారిని మధురకు రప్పించి, ఇక్కడే వారిని చంపించేందుకు వ్యూహం పన్నాడు. నందాదులను, బలరామ కృష్ణులను ఆహ్వానించడానికి, మధురలో వున్న ఒక యాదవ సేనాధిపతి అక్రూరుడిని గోకులం పంపించాడు కంసుడు. అక్రూరుడు మంచి కృష్ణ భక్తుడు. అతడు నందాదులను కలుసుకుని, బలరామ కృష్ణులను మధురకు తీసుకుపోవడానికి అనుమతిని కోరాడు.

మరునాడు వారితో కలసి మధురకు ప్రయాణమయ్యాడు అక్రూరుడు. దారిలో రథం ఆపి, వారిద్దరినీ రథంలోనే వుండమని చెప్పి, తాను యమునా నదిలో సంధ్య వార్చడానికి దిగాడు. రథంలో కూర్చున్న వారిద్దరూ నది మధ్యలో దర్శనమిచ్చారు. అది చూసి ఆశ్చర్యపోయిన అక్రూరుడు తల తిప్పి ఒడ్డున వున్న రథం వైపు చూశాడు. వారిద్దరూ అక్కడ రథంలోనే కూర్చుని నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. మళ్ళీ తిరిగి అర్ఘ్యం ఇద్దామని నదిలోకి చూసేసరికి మళ్ళీ నదిలో ఇద్దరూ దర్శనమిచ్చారు. ఆశ్చర్యంగా మళ్ళీ ఒడ్డువైపుకి తలతిప్పి చూడగా వారు అక్కడే కూర్చుని వున్నారు రథంలో. తికమక పడిపోయిన అక్రూరుడు నదిలో స్నానం చేయడానికి మునగగా, అక్కడ నీటిలో శేషపాన్పు పైన విష్ణుమూర్తి కనిపించాడు. ఫణిరాజైన ఆదిశేషుడు వేయిపడగలతో, రత్నమణి భూషణములతో వెలిగిపోతూ దర్శనమిచ్చాడు. శేషపాన్పుమీద పీతాంబరధారియై, శాంతాకారుడై, చతుర్భుజుడై, సర్వాలంకార శోభితుడై, బ్రహ్మరుద్రాదిదేవతలు, సనకాది మునులు, నంద సనందాది పార్షదులు, ప్రహ్లాద నారదాది భాగవతోత్తములు, మహర్షులు చుట్టూచేరి దివ్యస్తోత్రాలు చేస్తుండగా, శ్రీదేవి సేవ చేస్తుండగా, పాల సముద్రంపైన అపురూపమైన దర్శనమిచ్చాడు. మహాభాగ్యశాలియైన అక్రూరుడు భక్తిశ్రద్ధలతో ఇలా స్తుతించాడు....

గోపీ మానసచోరా! శుభాకారా! శ్రీమన్నారాయణా! వటపత్ర శాయీ! చతుర్భుజ ! పద్మనాభా! నీ మహిమను తెలుసుకోవడానికి గాని, వర్ణించడానికి గానీ ఆ బ్రహ్మకు కూడా సాధ్యపడదు కదా? నీవు అంతర్యామివి! సర్వసాక్షివి! ఈశ్వరుడవు! నిన్ను జ్ఞానులు, భక్తులు,

యోగులు పలువిధముల కొలుస్తారు. వేరువేరు మార్గాలలో ప్రవహించే నదులన్నీ సముద్రంలో ప్రవేశించినట్లు, అన్ని మార్గముల యొక్క గమ్యము నీవే కదా! నీవు అన్నింట్లో అంతటా నిండివుంటావు. నీకు అందరూ సమానులే. మత్స్య రూపంలో వేదాలను సంరక్షించావు! కూర్మరూపుడవై మందరగిరినెత్తావు! నారసింహుడవై భక్త ప్రహ్లాదుని రక్షించి, హిరణ్యకశిపుని సంహరించావు! వామనుడవై బలిచక్రవర్తిని గర్వమణచి అనుగ్రహించావు! భార్గవ రాముడవై దుష్ట క్షత్రియులను పరిమార్చావు! దశరథ రాముడవై రావణుని పరిమార్చావు! వాసుదేవుడవై వసుంధర యొక్క భారాన్ని బాపినావు! కల్కిరూపుడవై లోకకళ్యాణం చేయనున్నావు! వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధుల రూపుడవై సృష్టి, స్థితి, సంహార, శాస్త్ర, ధర్మ రక్షణ నిర్వహణ కార్యక్రమాలను చేస్తున్నావు! నీకు ఇవే నా ప్రణామములు! కృష్ణా! పరమేశ్వరా! నిన్ను తెలుసుకోలేని అజ్ఞానుడను నేను. నిన్ను నేను స్తుతింపగలనా? స్వామీ! నీ మాయలోనే మునిగి ప్రవర్తిస్తున్నాను. సంసార సుఖంలో మునిగినవాడను, నన్ను కరుణించి, అనుగ్రహించి రక్షించు. శ్రీహరీ! నీకు సాష్టాంగ దండ ప్రణామములు” అని స్తుతించినంతనే అక్రూరుని దృష్టి పథం నుండి స్వామి తన దివ్య దర్శనమును ఉపసంహరించాడు.

అక్రూరుడు నది నుండి రథము దగ్గరకు తిరిగి వచ్చాడు. కృష్ణుడు ‘అక్రూరా! నువ్వు స్నానానికి పోయి చాలా సేపు అయినది కదా! నది కూడా చాలా దగ్గరలోనే వున్నది కదా! మరి ఇంత ఆలస్యం ఎందుకైంది నువ్వు తిరిగి రావడానికి? మరి అక్కడ నీటిలోగాని, భూమి మీదగాని, ఆకాశంలోగాని ఏమైనా వింతలు విశేషాలు కనిపించాయా?’ అని అడిగాడు.

అక్రూరుడు భక్తి తన్మయత్వంతో నమస్కరిస్తూ, ‘ఓ మహానుభావా! నీలో లేని వింతలు, విశేషాలు ఇంకెక్కడైనా వుంటాయా? నీలో లేనివి నీటిలోగాని, నింగిలోగాని ఎట్లా వుంటాయి?’ అని అంటూ తాను పొందిన ఆ దివ్యదర్శనమును మననం చేసుకుంటూ రథాన్ని ముందుకు నడిపాడు.

# గురుభక్తి

- భోగరాజు భారతి

గురువు అనగానే అందరూ చెప్పే మొదటి శ్లోకం '**గురు బ్రహ్మ గుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**' ఈ శ్లోకం వెనుక అత్యంత ఆసక్తికరమైన కథ ప్రాచుర్యంలో వుంది. కొన్ని ఏళ్ళ క్రిందట గురుకులాలు వుండేవి. ఒకానొక ఆశ్రమంలో వేదధర్ముడు అనే సర్వశాస్త్రకోవిదుడు వుండేవాడు. ఈయన జ్యోతిష శాస్త్రంలో దిట్ట. ఈయన ఎంతమందినో పిల్లలను చేరదీసి తన వద్దే వుంచుకుని తనకు వచ్చిన సకల విద్యలను నిస్వార్థంగా బోధిస్తూ వుండేవారు. కౌత్సుడు అనే ఒక శిష్యుడు ఎంతో గురుభక్తితో వుంటూ విద్యను అభ్యసిస్తూ జ్యోతిష్య శాస్త్రంలో మంచి పట్టు సాధించాడు. అందరూ చదువు అయిపోయాక స్నాతక సభ ముగించుకుని గురువును, ఆశ్రమమును వదిలి వెళ్ళిపోయేవారు. అలాగే కౌత్సుని విద్య పూర్తి అయ్యే సమయానికి గురువుగారు ఏదో పని మీద గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చింది. వారు ఆశ్రమ బాధ్యతలన్నిటినీ కౌత్సునికి అప్పగించి వెళ్ళారు. వారు లేని లోటు లేకుండా సక్రమంగా విధులను నిర్వహిస్తూ వుండేవాడు. గురువుగారు వచ్చి ఎంతో సంతృప్తిని పొందారు. కౌత్సుని విద్యాభ్యాసం ముగిసి స్నాతక సభ జరిగింది. శిష్యులు అందరూ వారి అనుభవాలను, అనుబంధాలను గురువుగారికి చెప్పుకుని, ఆశీస్సులు అందుకుని తల్లిదండ్రులతో వెళ్ళిపోయారు. కౌత్సుడు మాత్రం నోరు మెదపకుండా వుండిపోయాడు. తల్లిదండ్రులతో వెళ్ళడానికి విముఖత చూపించాడు. తల్లిదండ్రులు చేసేది లేక తిరిగి వెళ్ళిపోయారు.

గురువుగారు అతనిని పిలిచి కారణం అడిగారు. కౌత్సుడు భోరున విలపిస్తూ 'గురువుగారూ! మీరు ఊరుకి వెళ్ళినప్పుడు మీరు నేర్పిన జ్యోతిష్య విద్యతో మీ జాతకం చూశాను. ఈ కార్తీక మాసం నుండి తమకు దారుణమైన కుష్ఠురోగం రాబోతున్నదని మీ గ్రహ స్థితి చెబుతోంది. ఇంత విద్య నేర్పించి, తిండి పెట్టిన మిమ్ములను కష్ట కాలంలో విడిచి వెళ్ళలేను. కనుక మీతోనే వుండిపోయి, మీకు సేవలు చేస్తూ మీరు ఆరోగ్యవంతులు అయిన తరువాతనే వెడతాను' అన్నాడు.

గురువుగారికి ఆశ్చర్యం, ఆనందం, దుఃఖం కలగలిపి రాగా, ఆనంద భాష్పాలు రాలుస్తూ వుండిపోయారు.

కౌత్సుడు వీరికి ఆ వ్యాధి రాకుండా ఏమేమి చేయాలో ఆలోచించి, పూజలు, జపాలు, యాగాలు చేసి తద్వారా వారికి ఆ వ్యాధి రాకుండా చేద్దామని చూస్తాడు. కానీ, గురువుగారు “ప్రారబ్ధం అన్నది ఎప్పుడైనా అనుభవించవలసినదే, ‘ప్రారబ్ధం భోగతో నశ్యేత్’ అని ఇప్పుడే దానిని అనుభవించి విముక్తుడను అవుతాను” అని అతడిని బాధ పడవద్దని చెబుతాడు. గురువుగారి మాటలకు ఎదురు చెప్పలేక ‘కాశీలో పుణ్యం చేసినా, పాపం చేసినా రెట్టింపు ఫలితం వస్తుందంటారు కదా, మనం అక్కడకు వెళ్లి పుణ్యకార్యాలు చేద్దాము, తమరు త్వరగా కోలుకుంటారు’ అన్నాడు కౌత్సుడు. సరేనని కాశీకి ప్రయాణమై వెళ్లారు.

అక్కడ కౌత్సుడు విద్యాదానం చేయడం, శివ పంచాక్షరీ మంత్ర జపం చేయడం, ఇతరులకు సహాయ సహకారాలు అందించడం చేస్తూ మిట్టమధ్యాహ్నం చెప్పులు లేకుండా జోలె పట్టుకుని భిక్షచేసి, గురువుగారికి పెట్టి తను తినేవాడు. గురువుగారు శిష్యుడికి ఎన్నో పరీక్షలు పెట్టేవారు. ఒక్కొక్కసారి కౌత్సుడు తెచ్చిన అన్నం తను తినకుండా అతడిని తిననివ్వకుండా విసిరి వేయడం, అతనిని తిట్టడం, కొట్టడం, చీదరించుకోవడం వంటివి చేసేవాడు. అతను మాత్రం వారికి వ్యాధి ముదిరి అలా చేస్తున్నారేమోనని మరింత శ్రమతో సేవలను చేస్తూండేవాడు.

కౌత్సుని గురుభక్తిని గమనిస్తున్న బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒక పందెం వేసుకున్నారు. ఎవరు అతనిని గురువు గారి దగ్గర నుండి పంపివేస్తారో వారే గొప్పవారని పందెం వేసుకున్నారు. ఇక్కడ గమనించ దగిన ముఖ్య విషయం గురువు గారిని ఇబ్బంది పెట్టడం కాదు. కౌత్సుడు భగవంతుని పరీక్షలకు నిలబడగల స్థాయికి వచ్చాడని నిరూపించడమే వారి లక్ష్యం.

బ్రహ్మ ముందుగా మారువేషంలో వచ్చి కౌత్సునితో ‘ఎందుకు నాయనా! ఆయన దగ్గర మాటలు పడుతూ వుంటావు. పెద్దవాడిని నేను చెబుతున్నాను. నా మాట విని వేరే గురువును చూసుకుని వెళ్లిపో!’ అన్నాడు. అందుకు కౌత్సుడు ‘గురువును ఈ పరిస్థితిలో వదలివేయమని

చెబుతున్నారు, మీరే ఈ పరిస్థితిలో వుంటే శిష్యుడు మిమ్మల్ని వదలి వెళ్ళిపోవాలని అనుకుంటారా?' అనేసరికి బ్రహ్మకు నోట మాట రాలేదు.

తరువాత విష్ణుమూర్తి మారువేషంలో వచ్చి, 'నువ్వు చేస్తున్న సేవకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కానీ చేసిన మేలు మరచిన కృతఘ్నునకు సేవచేస్తే పాపం వస్తుంది. కనుక ఆయనను వదలి వెళ్ళిపో' అన్నాడు. కౌత్సుడు 'ఈ సమయంలో వదలి వెళ్ళిపోతే నేనే కృతఘ్నుణ్ణి అవుతాను. ఆయన నన్ను చేరదీసి, తిండి పెట్టి, తమ విద్వత్తునంతా ధారపోసి, ఇంతవాణ్ణి చేశారు. ఆయన ఎందుకు కృతఘ్నులు అవుతారు?' అనేసరికి విష్ణువు వెను తిరుగుతాడు.

ఇహ ఈశ్వరుడే వచ్చి, 'మానవసేవే మాధవసేవ అన్నమాట వాస్తవమే. ఆయన తినకుండా, నిన్ను కూడా తిననీయకుండా చేయడం తప్పుకదా. కొన్నాళ్ళు నువ్వు దూరంగా వుంటే నీ విలువ తెలుస్తుంది ఆయనకు' అన్నాడు. దానికి కౌత్సుడు 'తిండిలేక బాధపడే నాకు తిండి పెట్టడమే కాకుండా, జీవితాంతం తిండిని పొందగలిగే విద్యను నాకు ధారపోశాడు. కనుక నన్ను కొన్ని రోజులు ఉపవశింపజేసే హక్కు వారికి వుంది. కనుక మహానుభావా! వీలయితే, నాకొక సహాయం చేయండి. మీ ముందు ఇద్దరు ఇలాగే వచ్చారు. మీరు కొన్ని రోజులు ఇక్కడే వుండి, ఇటువంటి అనవసరపు నీతులు చెప్పే వారిని రానివ్వకుండా చేయండి స్వామీ!' అన్నాడు.

అంతే! బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఇతని గురుభక్తికి మెచ్చుకుని 'మేము త్రిమూర్తులము. మేము పెట్టిన పరీక్షలో నీవు నెగ్గి అపారమైన గురుభక్తిని చాటుకున్నావు. నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాము' అన్నారు. కౌత్సుడు మీ దర్శన భాగ్యం కలగటం నా అదృష్టం. నా గురువే నాకు బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు. మిమ్మలను సృష్టించిన పరబ్రహ్మ కూడా నా గురువే. నాకు మోక్షానికి అర్హత కలిగించిన నా గురువునకే మోక్షాన్ని ప్రసాదించండి' అన్నాడు.

అప్పుడు త్రిమూర్తులు గురుశిష్యులిద్దరికీ మోక్షాన్ని ప్రసాదించారు!

# నేను

అసలు చిక్కంతా 'నేను' అనే దగ్గరే మొదలవుతుంది. నేను అన్యాయం అయిపోయాను నాకు అవమానం జరిగింది. నన్ను నిర్లక్ష్యం చేసారు. నన్ను తేలిగ్గా చూశారు. నాకు విలువ ఇవ్వలేదు. నాకు మర్యాద ఇవ్వలేదు. నా పరువు పోతుంది. నాకు చెడ్డపేరు వస్తుంది. నన్ను నలుగురూ గొప్పగా గుర్తించాలి. నన్ను బాధించినవారి మొహం నేనింక ఎప్పుడూ చూడను.

ఇలా... ఇలా...ప్రతీచోటా ''నేను''ని నింపేస్తే జీవితం ఇరుకైపోతుంది.. కొంచెం "నేను"కి విలువ ఇవ్వటం తగ్గించుకుంటూ ఉంటే జీవితం మరీ అంత బరువవ్వకుండా సులువుగా ముందుకి నడుస్తుంది. మనసులో ఎన్నో గజిబిజి ఆలోచనలకు మూలం నేను. ఒక్కసారి 'నేను-నాది' అనే భావం తొలిగించి చూస్తే చాలా అంతర్మధనాలు దూరం అవుతాయి. చాలా అయోమయాలు, కోపాలు, ఆవేశాలు, ఆలోచనల తాలూకు బరువును మన మనసు మోయనక్కరలేదు. నేను అనబడే నన్నుని ఎవరో ఏదో అన్నారని బాధపడి దిగులుపడి, అలా అన్నవారిని తిరిగి బాధించటానికి ఎన్నో ఆలోచనలు చేయటం అనవసరం.

చిత్రమేమంటే మనని అన్నవారు అనేసి హాయిగా తమ పనులలో మునిగిపోతారు, వారికి మనం గుర్తు కూడా ఉండము. కానీ మనం మాత్రం ప్రతీకార వాంఛతో నిత్యం వారినే గుర్తుచేసుకుంటూ సమయమంతా వృధా చేసుకుంటాము. ఈ ప్రతికూల ఆలోచనలతో 'నన్ను అవమానించారు' అనే బరువుని గుప్పిట్లో పెట్టుకుని ఉంచుకోక, కాసేపు గుప్పిట విప్పి 'నేను-నాది' అనే భావనని గాలికి వదిలేస్తే అసలైన శాంతి అక్కడ మొదలవుతుంది. ప్రయత్నించి చూస్తే ఇది కష్టమైన పనేమో కానీ అసాధ్యమైనది మాత్రం కాదు నేస్తం...

అస్థిత్వం రూపేణా 'నేను' అనే ఆలోచన అవసరం. కానీ మనం చిన్న చిన్న విషయాలలో కూడా, నేను అనే అంశం ఆధారంగా,

ఎక్కువగా తీసుకుని , మన మనసుని ఎదుటివారి కంటే కూడా, మనకి మనమే ఎక్కువగా బాధించుకుంటాము అనిపిస్తోంది. కుటుంబాలలో అందరమూ ఎంతో కొంత నిస్వార్థంగానే చాలాచోట్ల ఉంటాము. కానీ ఉన్నట్టుండి, ప్రేమలను పోల్చిచూసుకోవటమో, బేరీజు వేసుకోవటమో చేసి మన అశాంతిని మనమే కొని తెచ్చుకుని కుటుంబాలలో కలహాలు తెచ్చుకుంటాము. ఇలాంటి అనవసర, అల్పమైన, విషయాల్లో 'నేను' అనే కోణాన్ని వదిలేస్తే అన్నివిధాలా మంచిదేమో. చాలా మనస్పర్థలు ఇలాంటివే, అందుకే చాలాచోట్ల 'నేను' ని వదిలేస్తేనే జీవించటం తేలికవుతుంది...

## *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**జనవరి 2022-**

13 గురు - ముక్కోటి ఏకాదశి - శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన

14 శుక్ర - భోగి - శ్రీసద్గురుపాదపూజ.

15 శని - సంక్రాంతి - శ్రీసద్గురుపాదపూజ.

17 సోమ - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

27 గురు - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన.

**ఫిబ్రవరి 2022-**

12 శని - భీష్మఏకాదశి - భక్తసహిత శ్రీ సద్గురు మంగళమూర్తి ప్రతిష్ఠా వార్షికోత్సవము, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 బుధ - మాఘ పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 శుక్ర - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.


స్వభావం
మధుప
ఆధ్యాత్మిక సాధకులు సృష్టిలోని ప్రతి ప్రాణియందు దయ కలిగి ఉండాలి నాయనా!
అలా ఎందుకు గురుదేవా?
ఎందుకంటే సృష్టి అంతటా పరమాత్మయే నిండి ఉన్నాడు. అన్నిటిలో పరమాత్మను చూడటం నేర్చుకోవాలి.


పద, స్నానం చేద్దాం.
3


అమ్మో! తేలు!
4


అయ్యయ్యో!
కొట్టుకుపోతోందే!
5


ఆ!
6


చూశారా గురుదేవా! మీరు సాయం చేసినా ఆ తేలు మిమ్మల్ని కుట్టింది.
7


తన దగ్గరికివచ్చినవారిని భయంతో కుట్టడం తేలు స్వభావం. అలాగే ఆపదలో ఉన్న ఏ ప్రాణిని అయినా దయతో ఆదుకోవడం సాధువునైన నా స్వభావం. ఒక చిన్న ప్రాణే తన స్వభావాన్ని వదులుకోనప్పుడు ఉత్తమమైన మార్గంలో ఉన్న నేను నా సహజ దయగుణాన్ని ఎలా వదులుకోగలను?
8

# దేహాత్మ భావన

- పాలూరి కాళీ ప్రసాద్

పరమాత్మయైన శ్రీమన్నారాయణుడు తన అత్యున్నత స్థానం నుండి దిగివచ్చి, అంటే అవతరించి వరాహరూపుడైనాడు. ఆ వరాహ స్వామి, ప్రకృతి స్వరూపిణియైన భూదేవి కలయిక ద్వారా జన్మించినవాడు నరకాసురుడు. ఇతని రాజధాని ప్రాగ్జ్యోతిషపురం. అందరు అసురుల లాగానే ఇతను కూడా అనేక అకృత్యాలు చేసి వుంటాడు కాని మనం ముఖ్యంగా చెప్పుకోవలసినవి రెండు - ఒకటి - దేవమాత అదితి కర్ణకుండలాలు అపహరించడం, రెండు- పదహారువేల మంది స్త్రీలను బంధించడం. ఇతనికి వున్న వరం తన తల్లి చేతిలోతప్ప ఇంకెవరి చేతిలోనూ మరణం లేకపోవడం. ఆ వరానికి అనుగుణంగా మళ్ళీ ఆ భూదేవియే సత్యభామగా అవతరించి, శ్రీకృష్ణునితో కలిసి యుద్ధభూమికి వెళ్ళి ఆ నరకాసురుని వధించింది. అప్పుడు ప్రజలందరూ ఆనందంతో దీపావళి జరుపుకున్నారు.

ఇది మనందరిలోనూ జరుగుతున్న కథే. తన వున్నత స్థితి నుండి దిగి వచ్చిన ఆత్మ ఎప్పుడైతే ప్రకృతిగతమైన దేహత్రయంతో కలిసిందో అప్పుడే మనకు ఈ దేహం నేననే 'దేహాత్మ భావన' జనించింది. అదే నరకాసురుడు. ఇక అంతటితో మన శరీరమే ప్రాగ్జ్యోతిషపురం అయిపోయింది. 'ప్రాక్' అంటే తూర్పు అని అర్థం. అప్పటి మన దేశంలో తూర్పున మొదటిగా అస్సాంలో సూర్యుడు ఉదయిస్తాడు కనుక అదే ప్రాగ్జ్యోతిషపురం అని చెబుతారు. అయితే 'ప్రాక్' అంటే పూర్వం అనే అర్థం కూడా వున్నది. అంటే ఎప్పుడయితే ఈ దేహాత్మ భావన మనలో ప్రవేశించినదో అప్పుడే మనలోని దివ్యజ్యోతి మసకబారి పోయిందన్నమాట. అందుకే అది 'పూర్వం జ్యోతి వున్న పురం' అయింది.

'మా మనస్సు మా హృదయం పరస్పరం శత్రువులై మాలోని దివ్యజ్యోతి మసకేసిపోతున్నది' అని మనం పాడుకుంటాం. అయితే మనస్సుకి, హృదయానికి ఈ శత్రుత్వం ఎందుకు వస్తుంది? హృదయం ఎప్పుడూ సత్యాన్ని పలకమంటుంది. కానీ మనస్సు సత్యాన్ని పలికితే ఈ శరీరానికో, దాని పరువుకో, దానికి సంబంధించిన ఇతర వస్తువులకో హాని కలుగుతుందని అసత్యం చెబుతుంది. హృదయం శాంతిగా వుండమంటుంది. మనస్సు వున్నవీ, లేనివీ ఊహించుకుని ఈ

శరీరానికో, దానికి సంబంధించిన వారికో ఏదో హాని జరగబోతుందని అశాంతికి గురవుతూ వుంటుంది. హృదయం ఎదుటివాడిపై దయ చూపించమంటుంది. మనస్సు కులమో, మతమో, భాషో, జాతో ఇలా ఏదో ఒక సాకు చూపించి, వాడు మనవాడు కాదు పొమ్మంటుంది. హృదయం నిన్ను నువ్వు ఎలా ప్రేమిస్తున్నావో అందరినీ అలాగే ప్రేమించు అంటుంది. మనస్సు నేను వేరు, వాడు వేరు అంటుంది. మనస్సు ఇలా ప్రవర్తించడానికి కారణం ఈ దేహం నేననే దేహాత్మ భావనే కదా!

ఇహ మనలో దైవీ గుణాలు పెరిగి మనం దైవత్వాన్ని పొందాలంటే దానికి మూడు మెట్లు వున్నాయి - శ్రవణం, మననం, నిదిధ్యాస. మొదట గురువుల ద్వారా వచ్చే మంచి మాటలు వినాలి. తరువాత వాటిని మాటిమాటికీ గుర్తుకు తెచ్చుకుంటూ ఆచరణలో పెట్టుకోవటం, అనుభవంలోకి తెచ్చుకోవడం. అయితే మనం సత్సంగంలో కూర్చుంటే మన మనస్సు అవతలివారు చెప్పేది విననివ్వకుండా వారు చెబితే మనం వినేదేమిటి? అంటుంది. లేదా, నా అంతటి వాడు ఒకడు చెప్పేమాటలు వినేదేమిటి అంటుంది. ఒకవేళ ఇవన్నీ దాటి బుద్ధిగా కూర్చున్నా, ఒకవైపు వింటున్నట్లు నటిస్తూ, ఇంకోవైపు నిన్నటి జ్ఞాపకాలకో, రేపటి వ్యాపకాలకో మనస్సు లాక్కుపోతుంటుంది. దీనికి కారణం దేహాత్మ భావనే కదా! అదే నరకాసురుడు దేవతల జనని అయిన అదితి కర్ణకుండలాలను అపహరించడం. అంటే దేహాత్మ భావన మనలోని దైవీగుణాలకు జననియైన శ్రవణాన్ని హరించడం. అందుకే '**సన్న్యస్యశ్రవణం కుర్యాత్**' సన్యసించి శ్రవణం చేయాలని పెద్దలు చెబుతారు. అంటే శ్రవణం చేయాలంటే ముందుగా సర్వ సంకల్పాలను, వాటికి కారణమైన దేహాత్మభావనను సన్యసించాలి.

ఇక స్త్రీ అనే శబ్దం స, త, ర అనే మూడు అక్షరాలతో కూడినది. అంటే సత్వ, తమో, రజో గుణాలతో కూడిన మనస్సే స్త్రీ అని పెద్దలు చెబుతారు. మన దేహంలో మనస్సు ఎక్కడ వున్నది అంటే ఏం చెబుతాం? శరీరమంతా వ్యాపించి వున్నది. నీ శరీరంలో ఎక్కడ తాకినా, నొప్పి కలిగినా నీ మనస్సుకు తెలుస్తోంది కదా! మన శరీరంలోని నాడీ వ్యవస్థ ద్వారా మనస్సు శరీరమంతా వ్యాపించి వున్నది.

**(తరువాయి భాగము 28వ పేజీలో ..............................)**

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి)

- రేఖ

ఉపనిషత్ లోని 20వ మంత్రం ఈ విధంగా వివరిస్తోంది ..................

'నేను' అణువు కంటే సూక్ష్మము అణువును. మహత్తు కంటే మహత్తును. విచిత్రమైన ఈ విశ్వమును నేను. పూరాతన పురుషుడను నేను. ఈశ్వరుడను, హిరణ్మయ రూపుడను, శివ స్వరూపుడను నేను అని ఈ మంత్రం చెబుతోంది.

పరమాత్మకు ఆకారాలు వుండవు. కానీ ఆ నిరాకారమైన ఆత్మ తత్వాన్ని మనకు బోధించడానికి సద్గురువులు కొన్ని పదాలను వాడతారు. వేదాంత పరిభాషలో వ్యావహారికం, పారమార్థికం, ప్రాతి భాసికం అనే పదాలు ఉపయోగిస్తారు. ప్రపంచంలో మెలగాలి అంటే వ్యావహారిక దృష్టి కొంత కలిగి వుండాలి. మరి ఇంతటి ఆశ్రమం నడిపించాలి అంటే మహాత్ములు వ్యావహారికంగా కొన్ని పనులు చేయాలి. తమను ఆశ్రయించిన వారికి ఆశ్రయం కల్పించి, పారమార్థిక విషయాలను అందరికీ అందజేయాలంటే వ్యావహారికం అవసరం..

కొంతమంది కేవలం వ్యవహారంలోనే వుంటారు. దాని గురించే ఆలోచిస్తూ వుంటారు. అక్కడ 'నేను చేస్తున్నాను' అనే దేహ దృష్టి వుంటుంది. అలా వ్యావహారిక దృష్టిమాత్రమే వున్న వారికి శ్రీగురుదేవులు ఇలా చెప్పేవారు .... 'న్యాయపరంగా వ్యవహారం చెయ్యి. త్యాగ భావన కలిగి వుండు. నీవు ఆర్జించిన సంపదలో కొంత భాగం నీ జీవనం గడపటానికి ఉపయోగించి, మిగతాది దానధర్మాలకు ఉపయోగించు' అని.

మరి కొంత మంది మహాత్ములు పారమార్థిక దృష్టిలోనే నిరంతరం వుంటూ కూడా, మానవులను ఉద్ధరింప జేయటానికి, వారి బోధల ద్వారా వారిని సరియైన మార్గంలో పెట్టడానికి వ్యవహారాన్ని వుపయోగిస్తూ వుంటారు. కానీ నిరంతరం సత్యత్వాన్ని గుర్తిస్తూ, సాక్షిగా వుంటూ ప్రపంచంలో వుంటారు.

అలాగే మానవుడు ప్రపంచంలో తాను తానుగానే వుంటూ అన్ని పనులు చేయాలి. ఆ పరమాత్మయే నా చేత చేయిస్తున్నాడని గుర్తిస్తూ చేయాలి. సూర్యుడు, దీపం రెండూ కూడా కాంతినిస్తాయి.

వాటి ప్రకాశంలో మానవుడు రకరకాల పనులు చేస్తాడు. కానీ, సూర్యుడు, దీపం కూడా సాక్షిగా వుంటాయి. వాటికీ, మానవుడికీ కూడా శక్తినిచ్చేది ఆ పరమాత్మయే. ఆశక్తే లేకపోతే, ఆ సూర్యుడు, దీపము, మానవ శరీరము అన్నీ జడమే.

మనలో వున్న దివ్య చైతన్యాన్ని గుర్తింపజేయటానికే మనకీ ఉపనిషత్తును ప్రసాదించారు. ఎంతో సూక్ష్మమైనది తానే. అనంతంగా వుండి ఎంతో మహత్తరమైనదీ కూడా తానే. అదే ఆత్మ. బ్రహ్మ ఆ పరమాత్మను పైన తెలిపిన రెండు లక్షణముల ద్వారా ప్రకాశిస్తున్నాడు. సర్వవ్యాపియైన ఆకాశము సూక్ష్మాతి సూక్ష్మంగా నఖశిఖపర్యంతం వున్నది. విశ్వమంతా నిండి వున్నది.

'నేనే ఆత్మ' అనే భావన నిశ్చల ధ్యాన సమయంలో కలిగి వుంటే ఆ పరమాత్మ యొక్క సర్వవ్యాపకత్వమును తెలుసుకోగలుగుతాము. సాధకుడు ఈ ప్రపంచంలోనే వున్నా కూడా తన లోపల ఆ విషయ ప్రపంచం వుండదు. అప్పుడు అద్వితీయమైన ఆత్మ తత్వం ఒక్కటే వుంటుంది. ఇటువంటి అనుభూతిలో జాగ్రదాది అవస్థలు అన్నీ కూడా అంతమై, ఆ జీవుడు మహత్తరమైన ఆత్మ సాక్షాత్కారంలో, మూగబోయి, స్తబ్ధుడై, నిశ్చలంగా వుండిపోతాడు. అందుకే ఈ విషయం 'విచిత్రం' అనే పదం ద్వారా సూచిస్తున్నాడు ఆ బ్రహ్మదేవుడు.

- సశేషం

---

**26వ పేజీ నుండి 'దీపావళి.....' తరువాయి భాగం................**

ఈ నాడులు పదహారువేలని పెద్దలు చెబుతారు. అవే నరకాసురుడు బంధించిన పదహారు వేల స్త్రీలు. అయితే ఈ దేహాత్మ భావనతో బంధనాన్ని పొందుతున్న ఈ మనస్సుకి విముక్తి కావాలంటే ముందుగా త్రిగుణాలను వదలి, సత్యవస్తువైన పరమాత్మను పట్టుకోవాలి. అదే మనకు పెద్దలు చిన్ముద్ర ద్వారా సూచించారు. అలా త్రిగుణాలను వదలి సత్యాన్ని పట్టుకున్నప్పుడు స్త్రీత్వం నుండి సత్యభామత్వానికి ఎదుగుతాం. అలా ఎదిగిన మనస్సు ద్వారా మాత్రమే దేహాత్మభావన అనే నరకాసురుని సంహారం సాధ్యం!!

## కాల మహిమ

- సుషమ్నా ప్రసాద

కాలమనేది ఆద్యంతములు లేని అనంతమైన ప్రవాహము వంటిది. అందులోని కెరటాలలో మానవుడు బంధితుడై, ఎత్తుపల్లాలలో వుక్కిరిబిక్కిరి అవుతున్నాడు. కాలము భగవత్స్వరూపము. భగవద్గీతలో **'కాలః కలయతామహం'** కాలాన్ని గణించే కాలపురుషుడను నేనే అని అర్థము.

మానవుని ప్రవర్తన విచిత్రంగా వున్నా, మనం ఊహించని ప్రకృతి వైపరీత్యం జరిగినా, 'మన చేతిలో ఏమీ లేదు, అంతా కాలమహిమ' అని అంటూ వుంటాము. అంటే మానవుడు కాలానికి బానిసయే కాని, కాలము మానవునికి బానిస కాదు.

కానీ సత్సాంగత్యము, సద్గురుకృప, సద్గురుబోధా శ్రవణము వీటిలో గడపిన కాలము నిత్యకాలంలో జమ అవుతుందని సద్గురు దేవులు అభయమిచ్చారు. నిత్యకాలమెప్పుడూ భగవద్భక్తునికి ఆత్మానుభూతిని, ఆనందాన్ని కలిగిస్తుంది.

మానవుడి జీవితం పరిమితమైనది. కానీ, ఈ పరిమితమైన జీవితంలోనే అవధులులేని ఆత్మానందమును పొందటానికి సువర్ణావకాశము వున్నది. ఎవరైతే సద్గురుదేవులను ఆశ్రయించి, గురు వాక్యపాలన చేస్తాడో అట్టి భక్తుడు ఎప్పుడూ కూడా కాలానికి కీలుబొమ్మ కాడు. త్రికాలములను తన ఆధీనంలో ఉంచుకోగలిగిన సమర్థత గురుభక్తునికి మాత్రమే వున్నది.

రామభక్త హనుమాన్‌ని మనం చిరంజీవి అంటాము. చిరంజీవి అంటే చిరకాలము అందరి హృదయాలలో జీవించేవాడని అర్థం. దేహము కాలబాధితము. మార్పుతో కూడిన ఈ దేహం నశించక మానదు. కానీ, ఆంజనేయుడు **యత్ర యత్ర రఘునాధ కీర్తనమ్ తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్** అంటున్నాము. అంటే ఎక్కడెక్కడ రామనామ సంకీర్తన జరుగుతుందో అక్కడల్లా ఆంజనేయుడు అంజలి ఘటించి ప్రత్యక్షమవుతాడు. తాను చిరంజీవియై, తన బాటలో నడిచిన వారందరినీ చిరంజీవులుగా చేయగల సమర్థుడు. రాక్షసాంతకుడైన హనుమ తన కన్నులు వర్షించే బాష్పధారలతో అందరినీ ఆనందాబ్ధిలో పులకితులను చేస్తాడు. ఈ పరమానందాన్ని అనుభవించడానికి జాతి,

నీతి, కుల, గోత్రాలు, వయస్సు అనేవి ప్రతిబంధకాలు కావు. కబీర్‌దాస్ ఏ జాతికి చెందినవాడు? తురుష్కుడు కాదా? లింగభేదము అంతకంటే లేదు. గోపికామ తల్లులు స్త్రీ లింగమునకు చెందినవారు కాదా. నిరుపమానమైన కృష్ణప్రేమకు వారసులై నిరంతరం కృష్ణభక్తి అనే సరస్సులో జలకమాడుతూ, దేహదృష్టి, దేహాభిమానమనే వలువలను విసర్జించి, కాలము తమ పిడికిలిలో ఇముడ్చుకుని, నిత్యనూతన పడుచుతనంతో విరాజిల్లే గోపకాంతలు చిరంజీవులు కారా? వారి పడుచుతనానికి ఏనాడూ విఘాతం లేదు. అంటే వారు కాలాతీతులు.

అలాగే కలియుగంలో మీరాబాయి, సక్కుబాయి మొదలగు భక్తాగ్రేసినులు స్త్రీలు కారా? వారు మహిళాలోకానికి మణిపూసలై, మహిమాన్వితులై వెలుగొందుతున్నారు. కాలాన్ని జయించి కాలాతీతులు కావడానికి వయస్సుతో నిమిత్తం లేదు. కృతయుగంలో భక్తిభావ తరంగాలలో తేలియాడుతూ హిరణ్యకశిపుని అజ్ఞాన, అహంకార తిమిరావళి నుండి తరింపజేయాలనుకొన్న ప్రహ్లాదునికి అయిదు సంవత్సరాలే కదా. కాలాన్ని అధిగమించి ధృవతారగా వెలుగొందుతున్న ధృవుడు బాలుడు కాదా. వారెప్పుడూ బాలభానుడిలా ప్రకాశిస్తూ కల్మష రహితులై వెలుగొందుతున్నారు.

**అహమేవాక్షయ కాలః** - కాలములో నశించని కాలమును నేనే అని గీతాచార్యుడు భగవద్గీతలో నొక్కి వక్కాణించాడు. కాలతీతుడవటానికి కులంతో అసలు పని లేదు. భక్త నందనారుడు ఏ కులానికి చెందినవాడు? కాబట్టి కాలాన్ని అధిగమించడానికి కావలసినది నిష్కళంకమైన భక్తి ఒక్కటే. ఎందుకంటే భగవంతుడు భక్తవత్సలుడు, భక్తప్రియుడు, భక్త రక్షకుడు. నిష్కామభక్తి ఒక్కటే భక్తునికి నిర్మల తత్వమును, నిత్యకాలమును ప్రసాదిస్తుంది.

**యత్ర యోగీశ్వర కృష్ణః యత్ర పార్థో ధనుర్ధర ః**
**తత్ర శ్రీర్విజయో ర్భూతిః ధృవానీతిర్మతిర్మమ ।**

ఎక్కడ యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారియైన అర్జునుడు వుంటారో, అక్కడ సర్వ విజయము, సకలైశ్వర్యములు వుంటాయి. అంటే ఎక్కడ భక్తుడు భగవంతునిలో లీనమై, ఏకోన్ముఖముగా ప్రకాశిస్తాడో, అక్కడ కాల మహిమ అనేది తోక ముడుచుకుని పారిపోతుంది. కాలాతీతుడైన గురుదేవుని మహిమలో, కాలమహిమ లీనమైపోతుంది. మనం

క్రీ.శ. 2022 సంవత్సరంలో ప్రవేశిస్తున్నాము. నూతన సంవత్సరం శుభదాయకంగా, ఆనందంగా వుండాలని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాము. చూడండి! మనకు నూతన సంవత్సరంలో మూడు ద్వంద్వాలు వున్నాయి. 2022 - 2 2 2 అహంకార మమకారములు, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు అనే ద్వంద్వాలతో మానవ జీవితం ముడిపడి వున్నది. ఈ మూడు ద్వంద్వాలను కలిపితే ఆరు అరిషడ్వర్గాలు అవుతున్నాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే ఆరుగురు శత్రువులను, శమదమాది షట్క సంపత్తితో జయించాలి. శమము, దమము, తితీక్ష, ఉపరతి, శ్రద్ధ, సమాధానమనే ఆరు ఆయుధాలతో నిర్జించాలి. ఈ షడ్సంపదను సాధించడానికి భక్తియే పరమావధి. అందుచేత ఈ కాలప్రవాహాన్ని ఎదురీది, నిత్యానందమనే తీరాన్ని చేరడానికి గురుదేవుడనే నావికుణ్ణి ఆశ్రయిస్తే భక్తియనే నావలో పయనింపజేసి, నిత్యానందమనే తీరమునకు సురక్షితంగా చేరుస్తాడు. ఆ గమ్యాన్ని చేరడమే మన పరమావధి. మన సద్గురుదేవులను భక్తిశ్రద్ధలతో ఆశ్రయించి, వారి కరుణ అనే దివ్యౌషధంతో కరోనాకు స్వస్తి చెప్పి, 2022 నూతన సంవత్సరంలో అరిషడ్వర్గములను జయించి, దిగ్విజయులమవుదాం!!

**మన ఆశ్రమ హాస్పిటల్ డాక్టర్లు మరియు సిబ్బంది అవసరార్థులకు నిరంతరం వైద్యసేవ అందిస్తూ వున్నారు. నవంబర్ 2021లో 1064 పేషంట్స్‌కి ఉచితంగా వైద్యసేవలు అందించటమే కాకుండా 33 కాన్పులు మరియు 7 పెద్దాపరేషన్లు పూర్తిగా వుచితముగా చేయడం జరిగింది. ఈ మహత్కార్యానికి పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించిన భక్తులు మరియు దాతలకు శ్రీ గురుదేవులు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.**

**కార్య నిర్వాహక వర్గము**

**SHKVPB Trust Hospital**

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జనవరి 2022-**

1 శని - మాస శివరాత్రి, ఆంగ్ల సంవత్సరాది - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

2 ఆది - అమావాస్య

13 గురు - ముక్కోటి ఏకాదశి - ఉత్తర ద్వార దర్శనము - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 శుక్ర -భోగి - ఉత్తరాయణం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, అనంతరం శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట, భక్తసమారాధన,

15 శని - సంక్రాంతి - శనిత్రయోదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

16 ఆది - కనుమ

17 సోమ - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

27 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

30 ఆది - మాస శివరాత్రి

**ఫిబ్రవరి 2022-**

1 మంగళ - అమావాస్య

5 శని - వసంత పంచమి - శ్రీ సరస్వతీ పూజ.

8 మంగళ - రథ సప్తమి

12 శని - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

16 బుధ - మాఘ పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

25 శుక్ర - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

## భారతీకృష్ణ తీర్థ స్వామి

సేకరణ - మురళీ

1884వ సం. మార్చి 14న తమిళ బ్రాహ్మణ కుటుంబములో తిరునల్వేలిలో జన్మించారు శ్రీ వెంకటరమణ శాస్త్రి. వీరి తండ్రి శ్రీ నరశింహ శాస్త్రి తిరునల్వేలి తహసిల్దారుగా పనిచేసేవారు. మేనమామ చంద్రశేఖర శాస్త్రి విజయనగరం మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ గా చేసేవారు. ముత్తాత రంగనాథ శాస్త్రి గారు మద్రాసు హైకోర్టు జడ్జి. ఇటువంటి ఉన్నత విద్య కుటుంబములో జన్మించారు శ్రీ వెంకటరమణ శాస్త్రి. విద్యాభ్యాసం తిరుచిరాపల్లి, తిరునల్వేలి మరియు మద్రాసులలో జరిగింది. చిన్న వయస్సులోనే సంస్కృతంలో ప్రావీణ్యత సంపాదించారు. 1899వ సం.లో మద్రాసు విశ్వవిద్యాలయం వారు "సరస్వతి" అనే బిరుదు ప్రదానం చేశారు.

1905 లో జాతీయ విద్యా ఉద్యమం మరియు దక్షిణాఫ్రికా భారతీయుల సమస్యల కోసం వెంకటరమణ గోపాల్ కృష్ణ గోఖలే ఆధ్వర్యంలో పనిచేశారు. వెంకటరమణకు ఆధ్యాత్మిక విషయాలపై బాల్యం నుంచీ ఉన్న ఆసక్తి కొలది 1908లో శృంగేరీ మఠానికి చేరుకున్నారు. మఠాధిపతులు శ్రీ స్వామి సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతి వారి వద్ద ఆధ్యాత్మిక అధ్యయనం మొదలుపెట్టారు. రాజకీయ నాయకుల వత్తిడివలన రాజమహేంద్రవరములోని నేషనల్ కాలేజి ప్రొఫెసర్ గా 3 సంవత్సరములు పనిచేసి, తిరిగి 1911 లో శృంగేరీ చేరుకుని జగద్గురువుల వద్ద ఆధ్యాత్మిక విద్యాభ్యాసం కొనసాగించారు. సుమారు 8 సంవత్సరాలు సాధన చేశారు. ఈ సమయంలో జగద్గురువులు వెంకటరమణను యోగసాధనలో ప్రవేశపెట్టారు. వెంకటరమణ ఆ కాలములో ఏకాంతముగా సమీప అడవులలో ధ్యానము, యోగసాధన నియమ నిష్ఠలతో చేశారు. ఆ సమయంలోనే భగవత్సాక్షాత్కారం పొందారు. అంతే కాకుండా సమీప గ్రామాలలో ఉన్న పాఠశాలలలో సంస్కృతం బోధించారు.

8 సంవత్సరాల సాధన అనంతరం వెంకటరమణకు శ్రీ శంకరాచార్య దక్షిణామ్నాయ సాంప్రదాయములో ద్వారక పీఠాధిపతులు

స్వామి త్రివిక్రమ తీర్థులు సన్యాసదీక్ష యిచ్చి "స్వామి భారతీకృష్ణ తీర్థ" అనే నామం యిచ్చారు. అనంతరం భారతీకృష్ణ తీర్థులు శృంగేరీలోనే వుంటూ జగద్గురువులు శ్రీ స్వామి సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతి వారి వద్ద సకల ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకుంటూ, ఇతర శిష్యులకు మార్గదర్శకత్వం వహించేవారు. శృంగేరి పీఠం ఉత్తరాధికారులు శ్రీ స్వామి చంద్రశేఖర భారతి వారికి సంస్కృతం నేర్పిస్తూ, ఆధ్యాత్మిక సాధనలోని మెలుకువలు తెలియజేస్తూ, వేదాంత రహస్యాలను చర్చించేవారు. గోవర్ధనమఠం (పూరి) శంకరాచార్య స్వామి మధుసూధన తీర్థ వారి ఆరోగ్యం క్షీణించటంతో భారతీకృష్ణ తీర్థులకు ఆ మఠం బాధ్యత తీసుకుని పీఠాధిపత్యం వహించవలసి వచ్చింది. వీరు పూరి మఠానికి 143వ అధిపతి.

శ్రీ భారతీ తీర్థ స్వామి గోవర్ధన పీఠాధిపత్యం వహిస్తూ భక్తిని, భారతీయ సంస్కృతినీ ప్రచారం చేస్తూ అనేక దేశాలు పర్యటించారు. మతం, సైన్స్, గణితం, ప్రపంచ శాంతి మరియు సామాజిక సమస్యలపై అనేక గ్రంథాలు వ్రాశారు. ఫిబ్రవరి 1958లో వేదాంత ప్రచారానికి బ్రిటన్ మరియు అమెరికాలలో 3నెలలు పర్యటించారు. ప్రాచీన హిందూ మత గ్రంథాలయిన వేదాలను అధ్యయనం చేసిన తర్వాత "వేద గణితం" సూత్రాలను కనుగొని "వేద గణితం" పుస్తకం వ్రాశారు. ఈ పుస్తకం ఎంతో ప్రాచుర్యం పొందింది. 35 సంవత్సరాలు పూరి మఠం ఆధిపత్యం వహించి స్వామి భారతీకృష్ణ తీర్థులు ఫిబ్రవరి 2, 1960 న మహాసమాధి చెందారు.

ముఖ్య గమనిక

***14-12- 2021 శుక్రవారం భోగి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ అనంతరం శ్రీ బాబుకు భోగిపండ్లు పోయుట, భక్త సమారాధన.***



(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

ఈ విధంగా వశిష్ఠుల కథను చెప్పడం ముగించిన గురు మహారాజు "బ్రహ్మదేవుని ఆనతి మేరకు వశిష్ఠులు రాముడు వచ్చేంత వరకు వేచియున్నారు. రఘువుకు అజుడు జన్మించాడు. అజునికి దశరథుడు జన్మించాడు. పుత్రభాగ్యములేని దశరథుడు పుత్రకామేష్టి యాగమును చేసి రాముడు మరియు భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు అను నలుగురు పుత్రులను పొందాడు. ఆ నలుగురు వశిష్ఠులకు శిష్యులయ్యారు.

"పలువత్సరములు రాముని రాక కొరకు వేచియుండడం ఆయన గొప్పదనమే కదా! మనమెప్పుడూ భగవంతుని దర్శనం కొరకు, ఆధ్యాత్మిక విషయములు తెలుసుకోవడానికి ఎదురుచూడటంలో అసహనము పొందకూడదు. ఎందుకంటే అలాంటి వాని కొరకు నిరీక్షించుట ఒక తపస్సువంటిది. వాని కొరకు అధిక సమయం వేచియుండిన పిదప కలుగు ఆనందము వర్ణనాతీతము!" అని తెలియ పరచి, మా మనస్సులో కలిగిన చెడు తలంపులన్నింటినీ సద్గురువులు తొలగించివేసారు.

మొట్టికాయ మొట్టబడిన మా ఇద్దరికి, ఆ తరువాత సుమారుగా ఒక గంట సమయం ఆణిముత్యములవంటి మంచి విషయములను తెలియజేసి, "సమయమైపోతున్నదని కలత చెందవద్దు. మీ కోసమే ఒక లారీ బయట ఎదురుచూస్తుంది. దానిలో కూర్చుని మీరు తిరుగు ప్రయాణం కండి!" అని మాకు సెలవిచ్చారు శ్రీబాబు. ఆయన చెప్పినట్లే ఆశ్రమం వెలుపల మా కోసమే ఎదురు చూస్తున్నదా అనునట్లు విజయవాడవైపుకు వెళ్ళే ఒక లారీ కనిపించింది.

మమ్మల్ని ఎక్కించుకుని వెళ్తున్న ఆ లారీలో కూర్చుని, బాబు చెప్పిన వశిష్ఠుల కథను, ఆణిముత్యములవంటి విషయములను గూర్చి చర్చించుకుంటూ నేను, నా స్నేహితుడు విజయవాడకు చేరుకున్నాము.

ఇంటికి చేరుకొన్న నా మనసులో ఎన్నో అలజడులు చెలరేగాయి.

"వశిష్ఠులు మాత్రమేనా రాముని కోసం ఎదురుచూసారు? రామాయణ కావ్యమందు ఎంతమంది ఆ నీలమేఘశ్యాముని దర్శనం కొరకు, రామ కార్యమందు పాలు పంచుకొనుట కొరకు నిరీక్షించారో! వాస్తవముగానే ఆదికవి వాల్మీకి రచించిన కావ్యమంతయూ రాముని వీక్షణ కొరకై నిరీక్షించిన వారి భావనల సమ్మేళనమే కదా! ?' దానిని కాస్త పరికించి చూద్దామా?

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జనవరి 2022-**

1 శని - ఆంగ్ల సంవత్సరాది- సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

13 గురు - ముక్కోటి ఏకాదశి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

14 శుక్ర - భోగి - ఉత్తరాయణం - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట, భక్తసమారాధన.

15 శని - సంక్రాంతి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

17 సోమ - పుష్య పూర్ణిమ - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

27 గురు - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**ఫిబ్రవరి 2022-**

5 శని - శ్రీసద్గురుదేవుల మూర్తిప్రతిష్ఠ వార్షికోత్సవము (2015 మాఘ శుద్ధ పంచమి) శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

8 మంగళ - రథ సప్తమి- సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

12 శని- భీష్మ ఏకాదశి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

16 బుధ - మాఘ పూర్ణిమ - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

25 శుక్ర - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

## కరదీపిక

- సుషుమ్న ప్రసాద

దీపమును (టార్చ్‌లైట్) చేత ధరించినవాడు ఎంతటి అంధకారములోనైనా, సునాయాసంగా ముందుకు సాగిపోగలడు. ముందుకు సాగుతున్న కొద్దీ, దీపము ఇంకా ముందుకు వెలుతురును ప్రసరింపజేస్తూ, అంధకారాన్ని చీల్చుకుని బాటసారి పయనించి తన గమ్యాన్ని చేరుకుంటాడు.

అంటే మానవుడు చీకాకులనే కీకారణ్యములో, అజ్ఞానమనే అంధకారముతో నిండిన జగత్తులో పయనించే బాటసారి. ఈ అజ్ఞానమనే అంధకారమును, ఆత్మజ్యోతి అనే దీపకతోనే రూపు మాపగలడు. ఈ దీపిక మార్కెట్‌లో లభించే వస్తువు కాదు. బాహ్యమైన ద్రవ్యంతో ఈ కర దీపికను పొందలేవు. తమాషా ఏమంటే అసలు ఈ దీపం ఎక్కడో లేదు, నీలోనే వున్నది. అదే ఆత్మజ్యోతి. నీలో వున్నదనే విషయాన్ని విస్మరించి, నీవు బాహ్య జగత్తులో ఎంత వెదికినా అది నిష్ప్రయోజనము.

నిన్ను తరింపజేసే ఆత్మజ్యోతి నీలోనే వున్నదని తెలియజేసేవాడే గురుమూర్తి. సద్గురువును ఆశ్రయిస్తే, బాహ్య విషయాదులలో పరుగెడుతూ, కంటక సహితమైన ఈ జగత్తులో ముళ్ళు గుచ్చుకుంటూ, చీకటిలో దారి, తెన్ను తెలియక దుఃఖపూరితుడైన మానవుడిని తన గమ్యానికి చేర్చగల సమర్ధుడు సద్గురువు. నీ హృదయంలో నిరంతరం ప్రకాశిస్తున్న ఆత్మజ్యోతిని నేత్రములకు కమ్మిన అహంకార మమకార పొరలచేత నీవు దర్శించలేవు. ఆ కంటి పొరలను దివ్యనేత్ర వైద్యుడైన గురుమూర్తి వైరాగ్యమనే పనిముట్టుతో, శస్త్రచికిత్స చేయకపోతే, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే మొలకలతో ఉబ్బి, పూర్తిగా దృష్టిని కోల్పోయి అంధుడవుతాడు. అలాంటి గాఢమైన చీకటిని తొలగించి, ఆత్మజ్యోతి దర్శనము చేయించి, ఆత్మానందమును ప్రసాదించగల నేత్రవైద్యశిఖామణి గురుదేవుడొక్కడే!

మనకు జ్యోతి దర్శనం చేయించగల సమర్ధుడు, సద్గురు ప్రసాద దేవుడు ఒక కథ చెప్పారు. 'ఒక ఊరిలో ఇద్దరు ప్రాణమిత్రులు వున్నారు. వారిద్దరూ వారి ఇళ్ళల్లో విశ్రమించి వున్నారు. అందులో ఒకడికి

బాగా చుట్టకాల్చే అలవాటున్నది. అర్ధరాత్రి మెలకువ వచ్చి, చలికాలమేమో, వెంటనే చుట్ట కాల్చాలి అనిపించింది. ఇల్లంతా గాలించినా ఎక్కడా అగ్గిపెట్టె కనబడలేదు. వెంటనే వెలుగుతున్న లాంతరు పట్టుకుని, తన ప్రక్క వీధిలో వున్న స్నేహితుని యింటికి వెళ్ళి గట్టిగా తలుపు బాదాడు. గాఢ నిద్రలో వున్న మిత్రుడు మేలుకుని తలుపు తీశాడు. వెంటనే ఎదురుగా వున్న మిత్రుణ్ణి చూసి, కంగారుగా ఇంత అర్ధరాత్రి ఎందుకు వచ్చావు? అని అడిగాడు. వెంటనే ఆ మిత్రుడు 'నాకు నిద్రపట్టలేదు. కాలక్షేపం కోసం చుట్ట కాల్చుకుందామంటే అగ్గిపెట్టె ఎక్కడ పెట్టానో కనబడలేదు. అందుకని నీ దగ్గరకు నిప్పు కోసం వచ్చాను' అన్నాడు.

జ్ఞానేశ్వర్ అని పిలువబడే అతని మిత్రుడు పకపకా నవ్వి, 'అరే మిత్రమా! నీ చేతిలోనే లాంతరు వున్నది కదా, దానితో నీ చుట్ట వెలిగించుకోకుండా, ఇలా అర్ధరాత్రి పచార్లు చేయటమేమిటి?' అన్నాడు. అప్పుడు తన చేతిలో వున్న దీపం వంక చూసి, తన అవివేకానికి తానే సిగ్గుపడి, తనకు జ్ఞానోదయం కలిగించిన ఆ మిత్రునకు కృతజ్ఞతలు తెలిపాడు.

అలాగే సత్యాన్ని విస్మరించి, విషయాదులకు బానిసయై, అజ్ఞానాంధకారములో వున్న బాటసారులకు గురుదేవులు విషయాదులపై వున్న నీ దృష్టిని విశ్వేశ్వరునిపై మరలించి, నీలో వున్న ఆత్మజ్యోతి దర్శనమునకు దోహదం చేస్తున్నారు. అందుచేత గురుమూర్తిని మించిన కరదీపిక శిష్యునకు మరొకటి లేదు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి, ఫిబ్రవరి 2022 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జనవరి 2022 :*** AS 0405, 5127, 6508, 7000, 7428, 8511, 8516, 8593, 8595, 8599, 8602 to 8616, 8633 LM 4310, 4311, 4340, 4341.

***ఫిబ్రవరి 2022 :*** AS 5708, 7063, 7235, 7236, 7367, 7447, 8618-8631, 8634-8640, 8645-8654, 8657-8661, 8664, 8665 LM - 4315-4320, 4322, 4334T •

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీహరి రావుగారితో శ్రీ బాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

22-5-1967 : శ్రీ కాళీ జయంతి మహోత్సవాలకు యీ రోజు దీక్షా విరమణ రోజు. శ్రీ బాబు మంత్రాక్షతలను భక్తులందరిపైన చల్లుతూ ఆశీర్వదించారు. సత్సంగ సమావేశంలో ముందుగా తారకం గారిని, వెంకటరత్నం గారిని, హనుమాయమ్మగారిని మాట్లాడమన్నారు. శ్రీబాబు వాళ్ళు మట్లాడిన తరువాత "జేబులో మూడు రూపాయలు వేసుకుని వచ్చాను. వీళ్ళు ముగ్గురూ ఆ మూడూ తీసేసుకున్నారు. నా జేబు ఖాళీ. చివరకు నేనే మిగిలాను. ఎప్పుడూ చివరకు 'నేను' మాత్రమే మిగిలేది. ఇక చెప్పవలసిందేముంది? సత్త్వరజస్తమో గుణాలు మూడూ వెంట బెట్టుకుని



మానవుడు ప్రపంచంలోకి వస్తాడు. ఎన్నెన్నో చేస్తాడు, ఏమేమో అనుభవిస్తాడు. చివరకు ఆ మూడు (గుణాలు) రహితం చేసుకోగానే తానే మిగులుతాడు. అదే నిత్యము, సత్యము అయిన ఆత్మ వస్తువు" అన్నారు.

21-7-1967 : ఆషాఢ పూర్ణిమ - వ్యాస పూర్ణిమ. పాండుగారింట్లో జరిగింది.

22-7-1967 : నిన్న పూర్ణిమ నాడు పాండుగారింటికి పూజకు వచ్చిన భక్తులందరితో సహా యీ రోజు శ్రీ బాబు తమ యింటికి దయచేసి తమ ఆతిథ్యమును స్వీకరించ వలసిందిగా, శ్రీ బాబు బాల్య మిత్రుడైన నూనె మహాబలేశ్వరరావు గారు ప్రార్థించారు. శ్రీ బాబు "భక్తులందరితో కలిసి సత్సంగ సౌభాగ్యాన్ని అనుభవించటం ప్రధానంగాని, ఎవరింట్లో అయినా ఒకటే కదా! మళ్ళీ యింత మంది కోసం యీ శ్రమంతా మీ యింట్లో ఎందుకు?" అని వారింపజూశారు కాని మహాబలేశ్వరరావు గారు పట్టు పట్టటం వలన సరేనన్నారు. ఈ రోజు మహాబలేశ్వరరావు గారింటికి శ్రీ బాబు భక్త బృందంతో సహా విచ్చేశారు. శ్రీ సద్గురు పాదపూజ జరిగింది. భక్తులందరూ భోజనాలకు కూర్చున్నారు. శ్రీ బాబు మహాబలేశ్వరరావు గారిని, వారి శ్రీమతి ఉమాదేవి గారిని పిలిచి "భక్తులు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. అన్నము, పదార్థాలు సరిపోతాయో లేదో జాగ్రత్తగా చూసుకున్నారా?" అని అడిగారు.

“అటువంటి భయమే లేదు బాబూ! నిన్నటి జనానికి రెట్టింపు మందికి సరిపడే పదార్థం సిద్ధంగా ఉంది” అన్నారిద్దరూ. శ్రీ బాబు “అలాగా! అయితే సరే!” అన్నారు.

వడ్డన ప్రారంభమైంది. భక్తులందరూ **‘‘బ్రహ్మార్పణం బ్రహ్మహవిః...’’“అహం వైశ్వానారో భూత్వా...”** అనే భగవద్గీతా శ్లోకాలను పఠించి భోజనానికి ఉపక్రమించారు. “హరేరామ” నామ పఠనంతో భోజనాలు, వడ్డన చురుకుగా సాగాయి. శ్రీ బాబు కూడా భోజనాల వద్దకు వచ్చి అందరిని హుషారు చేస్తూ, కొసరి కొసరి వడ్డన చేయిస్తూ, సుశీలను **“భళి భళి భళి భళి దేవా! బాగున్నదయా నీ మాయ”** అనే పాట పాడమన్నారు. సుశీల పాడుతుంటే అందరు అందుకున్నారు. అందరితో బాటు శ్రీ బాబు కూడా **‘‘బాగున్నదయా నీ మాయ భళే బాగున్నదయా నీ మాయ’’** అని పాడుకుంటూ వెళ్ళిపోయారు.

ఇలాంటి విందు కార్యక్రమాలలో ఎందుకైనా మంచిదని అదనంగా అన్నం కోసం ముందుగానే గుండిగలతో ఎసరు మరిగించి ఉంచుతారు. మొదటి వడ్డనతోనే అన్నం చాలదనే అనుమానం వచ్చి మరిగే ఎసట్లో బియ్యం పోశారు. భోజనాలు సగం అయ్యేసరికి అన్నం నిండుకున్నది. అన్నం కోసం ఎదురు చూస్తూ, భక్తులు భగవన్నామం చేస్తున్నారు. మరిగే ఎసట్లో బియ్యం పోస్తే పది నిమిషాలలో వుడకవలసిన అన్నం అరగంట అయినా ఉడక లేదు. మహాబలేశ్వరరావు గారు, ఉమాదేవి గారు కంగారుగా వంటశాలలోకి, భోజనాల పందిరిలోకి తిరుగుతున్నారు. “వెయ్యిమందికి వండిన అన్నం అయిదు వందల మందికి సగం వడ్డన కూడా అవకుండానే నిండుకోవటం ఏమిటి? చిత్రంగా ఉందే?” అని వాళ్ళు విస్తుబోయి ఏం చేయాలో తోచక , గురువుగారి (హనుమాయమ్మగారు) దగ్గరకు వెళ్ళి విషయం చెప్పారు. ఆమె కూడా ఆశ్చర్యపడుతుండగా, ‘భళి భళి దేవా! బాగున్నదయా నీ మాయ!’ అని పాడుకుంటూ భోజనాల మధ్యలో శ్రీ బాబు బయటకు రావటం, మళ్ళీ లోపలికి వెళ్ళిపోవటం ఆమెకు గుర్తుకు వచ్చింది. వెంటనే ఆమె “మీరిద్దరూ వెళ్ళి శ్రీ బాబు పాదాలపై పడి క్షమించమని, యీ గండం నుండి గట్టెక్కించమని ప్రార్థించండి” అని వాళ్ళను శ్రీ బాబు గదిలోకి నెట్టారు. వాళ్ళు భయపడుతూనే వెళ్ళి శ్రీ బాబు పాదాలపై పడి నమస్కరించి “క్షమించండి” అన్నారు.

- సశేషం

# విఠ్ఠల  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## జనాబాయి

పరమ పుణ్యమైన కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ఐదు సంవత్సరాల బాలిక అయిన జనాబాయిని వెంటపెట్టుకొని ఆమె తల్లి తండ్రులు పాండురంగని దర్శించటానికి పండరీపురం వెళ్ళారు. చంద్రభాగా నదిలో స్నానం చేసి విఠలనాథుని దర్శనానికి వెళ్ళారు. జానాబాయి ప్రప్రథమంగా విఠలనాథుని దర్శించింది. ఆ ప్రథమ దర్శనముతోనే తన జీవితాన్ని పాండురంగని పాదాలకు అంకితం చేసింది. దర్శనం అయ్యాక తల్లిదండ్రులు బయలుదేరుతూ జానాబాయిని రమ్మని పిలిచారు. "దయామయుడైన పాండురంగడి సేవలో నా జీవితాన్ని చరితార్థం చేసుకొంటాను స్వామిని వదలి నేను ఇంటికి రాలేను" అన్నది.



"అమ్మా! జనా! అలా అనకు తల్లీ! కని, పెంచి పెద్ద చేసిన మమ్మల్ని వదలి, ఆలయంలో ఉంటానంటావేమిటి? నీ మీద మేము ఎన్ని ఆశలు పెట్టుకొని జీవిస్తున్నామో, నీకు తెలియదు. నిన్ను వదలి మేము జీవించలేము. రా తల్లీ! ఇంటికి పోదాము" అని ప్రేమగా పిలిచింది జానాబాయి తల్లి. తల్లి మాటలకు చిరునవ్వు ఒలకబోస్తూ "మిమ్మల్ని వదలి ఈ ఆలయంలో ఉండటం సబబు కాదంటున్నారు. మీరు నన్ను శాశ్వతంగా మీ వద్ద వుంచుకుంటారా! పెళ్ళిచేసి అత్తవారింటికి పంపుతారు కదా! అప్పుడైనా నా ఎడబాటు మీకు తప్పదు. ఈ ప్రపంచంలో వ్యక్తులపై మనం పెంచుకొనే ప్రేమానురాగాలు ఎంతోకాలం వుండవు. నా హృదయం పాండురంగడి పాదాలకు అంకితమైనది. ఆ స్వామిసేవలో నా జీవితాన్ని ధన్యం చేసుకుంటాను. నేను మాత్రం పండరీపురం వదలను. నన్ను క్షమించి మీరు వెళ్ళండి" అని చెప్పింది జానాబాయి. చేసేదిలేక ఆ బాలికను ఆలయంలోనే వదలి బరువెక్కిన హృదయాలతో వెళ్ళిపోయారు

ఆమె తల్లిదండ్రులు.

జానాబాయి ఆలయంలోకి వెళ్ళింది. కోటిసూర్యుల సమ ప్రభలతో వెలుగుతున్న పాండురంగడిని తదేకంగా చూసింది. "భగవాన్! నీకొరకు అందరినీ వదలుకొని ఒంటరిగా వచ్చేశాను. ఆమె నోటినుండి అప్రయత్నంగా ఈ గానం వెలువడింది.

యేరే యేరే మార్ఘ్యూ రామా
మన మోహన మేఘశ్యామ
అహూ నంతా మలా భేటీ
దేయి దేయి కృపా గోష్టి
ఆముచీ చుకవీ జన్మవ్యాధీ
ఆమ్యాదేయవో సమాధీ
జానీమ్యాణే చక్రపాణీ
కరీ ఐసే హూ కరోనీ ॥యేరే॥

"హే దయామయా! నువ్వు నాహృదయమంతా నిండిపోయావు. నా జన్మ ధన్యమైనది. నాకు సాధుసంతుల సాంగత్యాన్ని కల్పించు. వారి ఆధ్యాత్మిక అనుభవాలను విని తరించేటట్లు అనుగ్రహించు. సంసార బంధాలనుండి విముక్తి చేసి నాకు సద్గతిని ప్రసాదించు. హే చక్రపాణీ! సదా నీ దర్శన భాగ్యాన్ని నాకు కలిగించి నన్ను రక్షించు" అని గానం చేసింది.

అదే సమయానికి భక్తాగ్రేసరుడైన నామదేవుడు ఆలయానికి వచ్చాడు. ఆమె గానం విని ఆమె భక్తి ప్రపత్తులకు నామదేవుడు ఆశ్చర్యపోయాడు. "ఎవరమ్మా నీవు?" అని అడిగాడు. "నా పేరు జానాబాయి. పాండురంగడు నా తండ్రి, రుక్మాబాయి నా తల్లి. మీరు నాకు గురుదేవులు. నన్ను అనుగ్రహించి నాకు సరైన మార్గాన్ని చూపండి" అని నామదేవుని పాదాలపై పడింది.

నామదేవులు జనాను తనతో తీసికొని వెళ్ళి తన తల్లి గుణాబాయికి అప్పగించాడు.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## నవంబర్ 7 న శ్రీ మాతాజీ వారు భక్తులతో జరిపిన శ్రీశైల యాత్రా దృశ్యములు







REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2021-2023



నవంబర్ 15, కార్తీక శుద్ధ ఏకాదశి నాడు జరిగిన సామూహిక శ్రీ సత్యన్నారాయణ స్వామి వ్రత పూజలు





నవంబర్ 19, కార్తీక పౌర్ణమి నాడు జరిగిన శ్రీ సద్గురు పాదపూజ మరియు జ్వాలాతోరణం దృశ్యములు

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.